# సంభవామి యుగే యుగే

బాలభానుని తొలి లేత కిరణాలు ఆలయంలోకి వెలుగులు ప్రసరింపజేస్తున్నాయి. ఆ వెలుగులు సూర్యనారాయణ స్వామి వారి విగ్రహాన్ని అభిషేకం చేస్తున్నాయా అన్నట్లు ఉందా మనోహర దృశ్యం. ఆ సుందర దృశ్యాన్ని, అభయ ముద్రలోని స్వామిని రామారావు ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

శతాబ్దాల క్రితమే మానవ మేథ ఎంత పదునుగా, విజ్ఞానవంతంగా ఉండేదీ ఆనాటి శిల్పుల కట్టడాలు ప్రతిబింబిస్తున్నాయి. ఒక గొప్ప సంస్కృతి, నాగరికతలకు చిహ్నమే భారత దేశం.

ఆ ఆలయ నిర్మాణాన్ని, గోడల మీద చెక్కిన శిల్పాల్ని చూస్తూ మెల్లిగా అడుగులేస్తున్నాడు రామారావు. ఎదురుగా ఎత్తైన గోడ మీద బుద్ధ భగవానుడు పడుకుని ఉన్నాడు. అజ్ఞాన తిమిరంలో కూరుకుపోయిన జనాన్ని లేవనెత్తడానికి తన కాంతి పుంజాలతో చేయూతనిచ్చే ప్రయత్నంలో పాపం ఎంతో అలసిపోయి ఒకింత విశ్రాంతికై మేను వాల్చాడేమో అన్నట్లుగా ఉందా ఆ ఆరడుగుల విగ్రహం. ఆ బుద్ధుడినే తదేకంగా చూస్తున్న రామారావుకి తనను ఎవరో పిలుస్తున్నట్లయి ఉలిక్కిపడి వెనుదిరిగాడు.

ఎదురుగా ఉన్న వ్యక్తిని చూసి... "ఓ మోహన్ ! హౌ ఆర్ యూ ! ఎన్నాళ్ళయ్యింది చూసి... మీ... రు... నువ్వు... ఇక్కడా ?"

"అవును. ఇది మా వూరే. నేను జ్ఞాపకమున్నానన్నమాట" అన్నాడు విప్పారిన మొహంతో.

"వాడ్డూయూ మీన్ ?"

"మనం కలుసుకుని పదేళ్ళవుతోందేమో కదా ! అప్పుడే మరిచిపోతానా ?"

"ఇలా వచ్చారేమిటి ? పూనాలో పని చేస్తున్నట్టు విన్నాను."

"అవును —మోహన్. కొంత కాలం అక్కడ పని చేసి అక్కడ నచ్చక ఉద్యోగం వదిలేశాను."

"మరి ప్రస్తుతం..." సందేహిస్తూ ఆగిపోయాడు.

"ఏముందీ ప్రస్తుతం ఖాళీయే. మన దేశం గొప్పతనమంతా చూడాలనిపించింది. అందుకే హాయిగా దేశ సంచారం చేస్తున్నాను."

"చాలా బావుంది. నేను బొంబాయిలో మిల్లులో పని చేస్తున్నాను. మా నాన్న గారి ఆరోగ్యం సరిగా లేదని తెలిసి చూసి వెళ్దామని వచ్చాను. మీ ప్రోగ్రామ్ ఏమిటి ? ఈ చుట్టుప్రక్కల ప్రాంతాలన్నీ చూశారా ? మీ సామాను తీసుకుని మా ఇంటికి వచ్చేయ్యాల్సిందే."

"తప్పకుండా వస్తాను మోహన్. ఇక్కడ ఈ కందిరీగల్లాంటి దోమల్ని తప్పించుకోవడానికైనా మీ ఇంటికి వస్తాను. కానీ ఈ శిల్ప కళా సంపదను చూస్తుంటే బాహ్య ప్రపంచం అక్కరలేదనిపిస్తోంది కదూ!" తన్మయత్వంతో అంటూ మిత్రుని ఆహ్వానాన్ని అంగీకరించాడు.

★ ★ ★

ఇంట్లోకి అడుగు పెడుతూనే —"అరుణా ! మనింటికి ఎవరు వచ్చారో చూడు" అంటూ భార్యను పిలిచాడు మోహన్.

"మా క్లాస్‌లో రామారావు కంప్యూటర్ లాంటి వాడు. జీనియస్ అని చెపుతుండేవాడిని కదా! అతనే అతనే ఇతను. ఈ ఊరు చూద్దామని వచ్చాడు. హోటల్లో దిగాడు"

"ఇంటికి తీసుకు వచ్చి మంచి పని చేశారు" అంటూ మర్యాద చేసింది అరుణ.

వారి ఆదరణకు సంతోషించాడు రామారావు. ఎప్పుడో కాలేజీ రోజుల్లోని స్నేహితుడు తనని ఇంకా గుర్తుపెట్టుకున్నందుకు ఆనందించాడు కూడా !

ఆ రాత్రి ఇద్దరూ గడిచిన కాలేజీ జీవితం జ్ఞాపకాల్ని తవ్విపోసుకున్నారు. వెళ్ళిన ఆమనిలు, వేసవి, గ్రీష్మాలు అన్నీ ఆ కబుర్లలో దొర్లిపోయాయి. సంభాషణ ప్రస్తుత పరిస్థితుల వరకూ వచ్చింది.

"అయితే నీ సెలవు ఎప్పటి వరకూ?" అడిగాడు రామారావు.

"నేనూ రెండు రోజుల్లో వెళ్ళిపోతాను. నవరంగ్ కంపెనీలో ఉన్న వేకెన్సీకి అప్లై చేశాను. అది వస్తే ఇది మానేస్తాను" అని జవాబు చెప్పాడు మెహన్.

"ఆహా! అలాగా! బెస్టాఫ్ లక్" చెప్పాడు. తనూ ఆ ఉద్యోగానికి అప్లై చేశానన్న సంగతి మాత్రం ఎందుకో చెప్పాలనిపించలేదు రామారావుకి.

★ ★ ★

"నిక్షేపంలాంటి ఉద్యోగం వదులుకున్నారు. రాని ఉద్యోగం కోసం ఎన్ని రోజులు ఎదురు చూసినా ఫలితమేముంది?" అంటూ భార్య వండిపెట్టే భోజనం పంటి క్రింది కంకర్రాళ్లే అవుతున్నాయి రామారావుకి.

"ఏరా రాముడూ! ఏదో గొప్ప ఉద్యోగమన్నావు. తప్పకుండా వస్తుందన్నావు. నీ పెద్ద పిల్ల రేపు కాలేజీలో చేరాలి. ఏం చేస్తావో ఏమిటో? ఆ ఉద్యోగం వదులుకున్నాక వచ్చిన డబ్బులతో హాయిగా దేశాటన చేసి వచ్చావు. ఇప్పుడు కాలేజీ ఫీజు ఎలా కడ్తావో ఏమిటో?" అన్న తల్లి పలుకులకు.

'అలాగే అమ్మా! చూద్దాంలే' అంటూ బుర్ర తడుముకున్నాడు. దూరాన వచ్చే ఆశాకిరణానికి మబ్బులడ్డం వస్తున్నాయనిపించింది రామారావుకి.

"పోస్ట్" అన్న కేక వినిపించగానే తనకి అప్పాయింట్‌మెంట్ లెటర్ ఏమైనా వచ్చిందేమోనన్న ఆశ మనస్సులో మెదులుతుండగా ఆతృతగా వచ్చి కవరు అందుకున్నాడు.

ఫ్రం అడ్రస్ చూసేసరికి అది మోహను నుండి వచ్చిందని తెలిసింది. మెల్లిగా కవరు చింపాడు. "తనకి వరంగల్ కంపెనీలో ఉద్యోగం వచ్చిందని, వెంటనే జాయినవుతున్నానని" రాశాడు ఆ ఉత్తరంలో.

రామారావుకి కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది అది చదవగానే. కుర్చీలో కూలబడ్డాడు. తనకి వాళ్ళు ప్రకటించిన అర్హతలన్నీ ఉన్నాయని ఎంత సంబరపడ్డాడు. ఇంకా ఎక్కువే ఉన్నాయి. అయినా తనకు రాక మోహన్‌కి ఆ ఉద్యోగం వచ్చింది. ఇందులో ఏదో మోసం జరిగి ఉంటుంది.

భగవంతుడు అన్యాయం చేశాడు. తనకి ఆత్మాభిమానం ఎక్కువ. ఎవ్వరినీ దేహీ అని అడిగి ఎరుగడు. ఇది తన అహం మీద కొట్టిన దెబ్బ అని అనుకుంటూ గుండెల మీద చేత్తో రాసుకున్నాడు.

"ఏమిటండీ పిలిస్తే పలకరు. ఇదిగో కాఫీ" కాఫీ కప్పుతో వచ్చింది సీత భర్త దగ్గరకు. "ఏమిటండీ అలా చూస్తున్నారు. ఆ కవరు యేమిటి? ముందు ఆ కాఫీ తీసుకోండి" అంటూ కుదిపింది. రామారావులో చలనం లేదు. ఏదో అనుమానమొచ్చి 'అత్తయ్యా' అంటూ పిలిచింది "మీ అబ్బాయిని చూడండి. నాకేమిటో భయంగా ఉంది."

"అయ్యో! అయ్యో! డాక్టరుకి కబురు చెయ్యవే" అంటూ కొడుకుని మెల్లిగా మంచం మీదికి చేర్చింది.

డాక్టర్ చూసి "మైల్డ్ హార్ట్ ఎటాక్" అన్నారు.

★ ★ ★



వాడ్రేవు రమాదేవి

రామారావు లైఫ్ కెరీర్ మీద తగిలిన ఆ దెబ్బ సామాన్యమైనదేమీకాదు. ఉద్యోగం వస్తుందని ఇప్పటిదాకా ఎంతో ఆశతో ఉన్నారు ఇంటిల్లి పాదీ. ఈ పరిస్థితితో అందరూ జీవచ్ఛవాలైపో యారు.

ఎక్కడో యేదో జరిగి ఉంటుందనిపిస్తోంది నా మనస్సుకి. ఆ జనరల్ మేనేజర్ ఏ రికమండేష న్‌కో, లంచానికో అమ్ముడుపోయి ఉంటాడు. అందుకే మెరిట్ ఉన్న వాళ్ళంతా విదేశాలకు వెళ్ళిపోతున్నారేమో? చదువు, తెలివితేటలూ, శక్తి సామర్థ్యాన్ని చూపించే ఎన్నో సర్టిఫికెట్లనూ చూపించాడు తను. అన్నిటిలోనూ తక్కువైన ఆ మోహన్‌కి ఎలా వచ్చిందీ ఉద్యోగం? ఈ రకమైన ఆలోచనలతో —

రామారావులో రోజు రోజుకీ అసహనం పెరిగి పోతోంది. మనిషి పూర్తిగా మారిపోతున్నాడు.

ఒక రోజు హఠాత్తుగా మోహన్ వచ్చాడు.

"ఏమిటీ రామారావ్! నీ దగ్గర్నుంచీ ఉత్తరం కోసం చాలా రోజులు ఎదురు చూశాను. ఉద్యో గంలో జాయినయ్యి—నిన్ను చూద్దామని సెలవు పెట్టి వచ్చాను. అదేమిటి ఆ గెడ్డం? ఎంత చిక్కి పోయావో తెలుసా? మా ఊరు వచ్చినప్పటి రామారావు కాదు నువ్వు. ఇప్పుడు మా ఊరు వచ్చినట్లయితే నిన్ను గుర్తుపట్టి ఉండేవాడినే కాదు."

"హమ్మయ్య! అయ్యిందా నీ పలకరింపు! పాపా! అంకుల్ వచ్చారు కాఫీ పట్టుకురా" అని చెప్పి —"ఆ! ఇప్పుడు చెప్పు. నీ కొత్త ఉద్యోగం ఎలా ఉంది?" అంటూ ప్రశ్నించాడు రామా రావు.

"ఉద్యోగానికేం! బ్రహ్మాండంగా ఉంది. ఆ జగ న్నాథంగారు సాయం చేయకపోతే నాకీ ఉద్యో గం వచ్చేదే కాదు."

"అదేమిటీ" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును —ఆ పారిశ్రామికవేత్త రికమండేషన్ ద్వారానే నాకీ జాబ్ వచ్చింది."

ఇంతలో రామారావు తల్లి 'ఎవరూ' అంటూ అక్కడకు వచ్చింది.

"నమస్కారం అమ్మా! నేను రామారావు స్నేహితుడిని. అతన్ని చూసి వెళదామని వచ్చాను."

"అలాగా ! సంతోషం నాయనా! ఉద్యోగం వస్తుందని గంపెడాశతో ఉన్నాడింతకాలం. ఆ ఉద్యోగం కాస్తా మరో మోహన్‌రావు అన్న అత నికి వచ్చిందట. మా వాడికి అన్ని అర్హతలూ ఉన్నాయి. కలికాలం నాయనా! అది తట్టుకోలేక మాయదారి గుండె జబ్బు తెచ్చుకున్నాడు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు" అంటూ ఎదుటి మనిషి వినిపించుకున్నాడో లేదో చూసు కోకుండానే తన ధోరణిలో చెప్పుకుపోతోంది ఆవిడ.

ఆ మాటలు వింటున్న మోహన్‌కు ముచ్చెమ టలు పోశాయి. అదేమిటీ! రామారావు కూడా ఈ ఉద్యోగానికి అప్లై చేశాడా? తనకి తెలియదే ఆ సంగతి! ఒక్కసారైనా తనతో అనలేదు. అర్హతలు తక్కువగా ఉన్న తను అందలమెక్కి ఎంత అవ మానాన్ని పొందాడు! ఛీ! తను ఎంతో గర్వంగా రికమండేషన్‌తో ఉద్యోగం సంపాదించుకున్నా నని చెప్పాడు. అరెరె! ఎంత పని జరిగి పోయింది అని అనుకుంటూ వాళ్ళ ముందు తలెత్తుకోలేక మెల్లిగా అక్కడి నుండి బయటికి వచ్చాడు.

★ ★ ★

ఈ సాంఘిక జీవితంలో మనుగడ కోసం నిత్యం జరిపే యుద్ధంలో ఎవరిది పై చేయి అవు తుందో ఆఖరి క్షణం వరకూ తెలియదు.

ప్రపంచంలో రోజు రోజుకీ వక్రమార్గంలోకి పయనిస్తున్న తెలివితేటల్ని చూస్తుంటే ఆశ్చ ర్యంగా ఉంటోంది. ఆలోచిస్తూ టెలిఫోన్ బూత్ వైపు నడిచాడు రామారావు. అక్కడ ఉన్న కొండ వీటి చాంతాడంత క్యూను చూడగానే నీరసం వచ్చింది. ఎప్పటికి తన వంతు వస్తుందో అను కుంటూ క్యూలో నిలుచున్నాడు. తన వంతు రాగానే తను అప్లై చేసిన కంపెనీ జనరల్ మేనే జర్ రావు గారికి డయల్ చేశాడు.

"మీరు రికమండేషన్లకూ, లంచాలకూ అమ్ము డుపోయి అర్హత ఉన్న అభ్యర్థులను ఎన్నుకో లేదు. అది ఒక్క మీ కంపెనీకే కాక తద్వారా దేశా నికి కూడా నష్టమే. ప్రతిభ ఉన్న వారికి ఆ అవకా శం వచ్చి ఉంటే దేశాభ్యున్నతికి ఎంతగానో దోహ దం చేసి ఉండేవాడు. మీరు దేశ ద్రోహులు. ప్రగతి నిరోధకులు. మీలో ఏ మాత్రం నిజాయితీ ఉన్నా నాలాంటి వాళ్ళను కాలదన్ని అసమర్థు లకు అర్హత కల్పించినందులకు రాజీనామా చేస్తే బావుంటుంది" అని చెప్పి ఫోన్ పెట్టేశాడు.

రావుగారు స్థాణువైపోయారు ఆ మాటలు విని. ఎదురుగా మోహన్ నిలుచుని ఉన్నాడు.

"సార్! ఒక మంచివాడు, నీతి, నిజాయితీ, అర్హత ఉన్న అభ్యర్థి ఉద్యోగాన్ని అన్యాయంగా ఆక్రమించిన నేరానికి నేను రాజీనామా చేస్తు న్నాను. ఈ ఉద్యోగం రామారావుకి ఇవ్వండి సార్!" అంటూ రాజీనామా కాగితాన్ని రావు గారికి అందజేశాడు.

కానీ అసహనం, అవమానం తట్టుకోలేక రామారావు జీవితానికే రాజీనామా చేసాడని వాళ్ళకి అప్పటికింకా తెలియదు.

●